వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 307
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
సెప్టెంబర్ 18, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



## పట్టుదలతో చదవాలి అనుకున్న లక్ష్యం చేరాలి

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్
- విద్యార్థులకు దిశా నిర్దేశం చేసిన కలెక్టర్

8లో..

# కేఎం @ 63

## అజాతశత్రువు కొండా మురళీధర్ రావు



ఒక్కడు.. ఒకే ఒక్కడు.. ఎవరికి అర్థం కాని ప్రజా నాయకుడు. ఆయన నటుడు కాదు.. కానీ, మెగాస్టార్ లెవెల్ లో కనిపిస్తారు. కాకతీయుల గడ్డ ఓరుగల్లులో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ సృష్టించుకున్న ఆయనే ..రాష్ట్ర అటవీ, పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు (కేఎం). ఒక గ్రామ సర్పంచిగా ఆయన ప్రస్థానాన్ని ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ గా, డీసీసీబీ చైర్మన్ తోపాటు రెండుసార్లు శాసనమండలి సభ్యుడిగా సేవలందించిన కేఎం ఏకశిలా నగరంలో రాజకీయంగా చక్రం తిప్పుతున్నారు. విద్యార్థి దశ నుంచే ఆయన ప్రచార ఆర్భాటాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. ఎప్పుడు ఖడక్ వస్త్రాలు ధరించి పటాటోపం ప్రదర్శించే ఆయన నమ్మిన వారిని పైకి తేవడం.. వ్యతిరేక శక్తులను శంకరగిరి మాన్యాలకు పంపడం ఆయన నైజం . రాజకీయ రంగంలో ఎవరితోనైనా పోటీపడే తత్వం, ఆత్మవిశ్వాసం, సంకల్ప బలం ఆయనలో మెండుగా ఉంది. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా తనకంటూ ప్రత్యేక గుర్తింపుతో ముందుకెళ్తున్న కేఎం.. సతీమని కొండ సురేఖను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించడంతో పాటు రెండుసార్లు రాష్ట్ర మంత్రిని చేశారు. గతంలో రాజకీయ కుటుంబ నేపథ్యం కాకున్నా రాజకీయాల్లో ప్రవేశించి.. ప్రజల్లో నేడు సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న కొండ మురళి అంటే చాలామందికి హడల్. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ లతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్న ఆయన చారిత్రక ఓరుగల్లులో కింగ్ మేకర్ గా వెలుగొందుతున్నారు. రాజకీయాల్లో కేఎం అంచలంచలుగా ఎదిగిన క్రమం, ఆయనకు సహకరించిన శక్తులు, వ్యక్తులు, కలిసి వచ్చిన అంశాలపై ఒక సింహావ లోకనం..

వివరాలు2లో..



- అందరి వాడు.. కాని ఎవరికీ అర్థం కాడు
- జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర
- ఏ పార్టీ అధికారంలో ఉన్నా తనకంటూ ప్రత్యేక గుర్తింపు



## స్వచ్ఛతే బీజేపీ లక్ష్యం

- జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- 35వ డివిజన్ లో రహదారులు శుభ్రం చేసిన నేతలు

8లో..



## నాణ్యతతో ఇందిరమ్మ ఇండ్లు

- కలెక్టర్ సత్య శారద
- ప్రభుత్వ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీ



## 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

- శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు
- పోస్టర్ విడుదల చేసిన ఆలయ చైర్మన్ శ్రీనివాస్



8లో..

## శంకరమఠానికి అపూర్వ కానుక

అధునాతన భవనం పత్రాలు జగద్గురువుకు అందజేత

వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, సెప్టెంబర్ 18, 2025

గడ్డం కేశవమూర్తి

# కేఎం@63

## అజాతశత్రువు కొండా మురళీధర్ రావు

### అందరి వాడు.. కాని ఎవరికీ అర్థం కాడు | జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర

### ఏ పార్టీ అధికారంలో ఉన్నా తనకంటూ ప్రత్యేక గుర్తింపు



**దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుత రాజకీయాలు కొండా మురళీధర్ రావు చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. రాజకీయంగా ఎందరికో భవిష్యత్తును కల్పించిన ఓరుగల్లులో నేడు కేఎం ప్రాధాన్యం పెరిగింది. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఆయన సతీమణి కావడం.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరి నియోజకవర్గాలకు వారు పరిమితం కావడంతో మురళి ఉమ్మడి జిల్లాలో కర్త, కర్మ, క్రియ అన్ని తానై నడిపిస్తున్నారు. జనం మెచ్చిన నేతగా కీర్తించబడుతున్న మురళి తాను చెప్పాల్సిన విషయాన్ని కుండబద్దలు కొట్టినట్లుగా చెబుతారు. మొహమాటం ఉండదు.. వెనుకోమాట.. ముందు మరో మాట అసలే ఉండదు. విమర్శ అయిన.. ప్రశంస అయినా.. మనసులో అనుకున్నది వ్యక్తం చేస్తారు. విమర్శలు.. ఆరోపణలకు బెదరరు. ఆయన ఏది ప్లానింగ్ చేసుకోరు. అన్ని అలా జరిగిపోతుంటాయి అంతే? కానీ, ఆయన చేతిలోని రెండు సెల్ ఫోన్లు మాత్రం ప్రతి క్షణం మోగుతుంటాయి. అధికారులైన, ప్రజా ప్రతినిధులైన, అనుచరులైన అవసరాలను బట్టి అర్థవంతంగా మాట్లాడుతారు. సమయానుకూలంగా వ్యవహరిస్తారు.**

### కుటుంబ నేపథ్యం..

జననేత కొండా మురళీధర్ రావు 1963 జూన్ 10న కొండా చిన్నమ్మ, కొమురయ్య పటేల్ దంపతులకు కనిష్ఠ పుత్రుడిగా జన్మించారు. ఆయన విద్యాభ్యాసం స్వగ్రామమైన వంచనగిరి, ధర్మారంతో పాటు వరంగల్ లో కొనసాగింది. విద్యార్థి దశలోనే ఆయనకు నాయకత్వ లక్షణాలు అలవడ్డాయి. ఇంటర్, డిగ్రీ స్థాయిలో గ్యాంగులు మెయింటైన్ చేస్తూ తన మిత్రులపైన ఈగ కూడా వాల కూడా చూసుకునేవాడు. నిరుపేదలైన మిత్రులు ఫీజులు చెల్లించలేని స్థితిలో ఉంటే ఆయనే చెల్లించిన సందర్భాలెన్నో ఉన్నాయి. ఎల్బీ కళాశాలలో సహా విద్యార్థిని కొండా సురేఖతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. మిత్రుల సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానంలో వీరి వివాహం జరిగింది. కాలేజీ విద్య పూర్తికాగానే స్థానిక సంస్థలకు ఎన్నికలు వచ్చాయి. వెంటనే స్వగ్రామమైన వంచనగిరికి వెళ్లి సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు వ్యతిరేకంగా ఎవరు నామినేషన్ వేయకపోవడంతో 1987లో ఏకగ్రీవంగా సర్పంచ్ పదవి వరించింది. అనంతరం ఆయన గీసుకొండ మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు అయ్యారు. 1991 లో జరిగిన కో–ఆపరేటివ్ ఎన్నికల్లో వంచనగిరి సింగిల్ విండో చైర్మన్ గా గెలుపొందారు. సుదీర్ఘకాలం ఆ పదవిలో కొనసాగిన మురళి 2005 నవంబర్ 18న డీసీసీబీ చైర్మన్ గా ఎన్నికయ్యారు. అనంతరం 2009, 2015 సంవత్సరాల్లో వరుసగా రెండుసార్లు శాసనమండలికి ఎన్నికై రాజకీయాల్లో స్థిరపడ్డారు.



### సమగ్ర అభివృద్ధి కోసం..

సతీమణి రాష్ట్ర మంత్రి సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో సమగ్ర అభివృద్ధి కోసం కేఎం నిరంతరం పనిచేస్తున్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన ప్రజలను కొండా దంపతులు ఏనాడూ మరువరు. అందుకే గరీబోళ్ల అవసరాలు తీర్చడమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారు. ముఖ్యంగా పార్టీలో, పవర్ లో ఎవరు నెంబర్ వన్ స్థానంలో ఉంటారో ఆయా సమయాల్లో వారికి ఆయన సన్నిహితుడిగా మెదులుతూ వస్తున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అండదండలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కేఎం ఓ వెలుగు వెలుగుతున్నారు.

### జనం మెచ్చిన నేతగా..

విరోధుల కదలికలపై అప్రమత్తత.. రాజకీయాల్లో అనునిత్యం అప్రమత్తంగా ఉంటూనే.. విరోధుల కదలికలపై ఓ లుక్కేస్తుంటారు. విపక్షాల వ్యూహాలను గమనిస్తూ.. పరిస్థితులకు అనుగుణంగా పక్కా ప్రణాళికలతో ఆయన ముందుకు వెళ్తారు. ఆయన దగ్గరకు వచ్చిన వారిని క్షుణ్ణంగా పరిశీలించే తత్వం కలిగిన ఆయన కిలకిల నవ్వుతూ అందరినీ ఆకట్టుకుంటారు. వరంగల్ నుంచి సుదీర్ఘకాలం ఎమ్మెల్సీగా కొనసాగి రికార్డు సృష్టించిన మురళి ప్రజానీకానికి వివిధ రూపాల్లో కనిపిస్తారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పైన.. యంత్రాంగం పైన పూర్తి పట్టు సాధించిన మురళి చారిత్రక ఓరుగల్లు జిల్లాలో ఒకే ఒక్కడుగా వెలుగొందుతున్నారు.

### ఎవరినీ నమ్మడు !

రాజకీయాల్లో జిల్లా టైగర్ గా పేరు గడించిన ఆయనను చూస్తేనే ప్రత్యేకంగా కనిపిస్తారు. ఇక వ్యవహార శైలి.. పుట్టించిన బ్రహ్మదేవుడికే అంతు పట్టదు. కళ్లలో కళ్లు పెట్టి ఎంత నిశితంగా పరిశీలించినా.. ఆ కళ్ల వెనుక ఉన్న భావమేమిటో.. ఆయన ఏం ఆలోచిస్తున్నారో ఎవరి అంచనాలకు అందదు. ఆయన చేసే పనిని ఎవరికి తెలియనివ్వరు. ఒకే విషయాన్ని పదిమందితో మాట్లాడినా ఎవరితో ఏం మాట్లాడారో ఇంకొకరికి తెలియనివ్వరు. ఒకరి విషయాలను మరొకరి దగ్గర ప్రస్తావించరు. విభిన్న కోణాల నుంచి సమాచారాన్ని తీసుకొని విశ్లేషించుకుంటారు. నేటి రాజకీయాలపై సమగ్ర అవగాహన కలిగిన కొండా మురళీధర్ రావు ఎవరినీ నమ్మరు. అందరిని పరిగణలోకి తీసుకుంటూ, విశ్వసిస్తున్నట్లు కనిపిస్తారు. కానీ ఆయన ఎవరిని పూర్తిగా విశ్వాసంలోకి తీసుకోరు. ప్రస్తుత రాజకీయాలపై స్పష్టత ఉన్నప్పటికీ అప్పుడప్పుడు ఆయన ఆవేశాన్ని కూడా ప్రదర్శిస్తుంటారు. పరిస్థితులు చేయిజారిపోయినప్పుడో.. అసహనం పెరిగిపోయినప్పుడు ఇలా చేస్తుంటారు. అయినా ప్రజలు ఆయన చుట్టూ చక్కర్లు కొడుతూనే ఉంటారు. రాజకీయపరంగా ఆయన ఎలా వ్యవహరించినప్పటికీ ప్రజలు మాత్రం ఆయనకు అడుగడుగున బ్రహ్మరథం పడుతునే ఉన్నారు. మొదటినుంచి అభ్యుదయ భావాలు కలిగిన ఆయన కాంగ్రెస్ పార్టీలో తిరుగులేని నాయకుడిగా ఎదిగి ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసు కున్నారు.











# రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు

## ◆ భయంతో ప్రయాణిస్తున్న వాహనదారులు

**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల పరిధిలోని రాయపర్తి, పులిగిల్ల, చర్లపల్లి గ్రామాల మీదుగా వెళ్లే పరకాల–జమ్మికుంట ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. వర్షాకాలం తర్వాత రోడ్డుపై ఏర్పడిన పెద్దపెద్ద గుంతల్లో నీరు నిలిచి, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ ప్రాంతంలోని నార్లాపూర్, చర్లపల్లి, వరికోల్, పులిగిల్ల గ్రామాలకు చెందిన వాహనదారులు పరకాలకు వెళ్లాలంటే గుంతల రోడ్డుపై ప్రయాణించలేక, పులిగిల్ల నుంచి నడికూడ మండల కేంద్రం మీదుగా హుజరాబాద్ ప్రధాన రహదారి ద్వారా పరకాలకు చేరుకుంటున్నారు. దీంతో ప్రయాణ దూరం పెరిగి, రవాణా ఖర్చు అధికమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. వాహనాలు దెబ్బతిని ఆర్థికంగా నష్టపోతున్నామని, అధికారులు





నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

### రిపేర్లతో ఆర్థికంగా దెబ్బతింటున్నాం..

**అల్లం వజ్రం, ఆటో డ్రైవర్**

ప్రభుత్వ పథకాలు, దెబ్బతిన్న రోడ్లతో ఆటో డ్రైవర్ల జీవనోపాధి దారుణంగా దెబ్బతింటోందని ఆటో డ్రైవర్ల సంఘం ఉపాధ్యక్షుడు అల్లం వజ్రం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మహాలక్ష్మి పథకం తమ జీవనోపాధిని దెబ్బతీసిందని, దీనికి తోడు గుంతలు పడ్డ రోడ్లపై ఆటోలు నడపడం వల్ల వాటికి అధికంగా రిపేర్లు వస్తున్నాయని తెలిపారు. అరకొర ఆదాయం అంతా రిపేర్లకే సరిపోతోందని, ఆటోలపై ఉన్న అప్పులు, కుటుంబ పోషణ భారంగా మారాయని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

# ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



**హనుమకొండ, నడికూడ :** హనుమకొండ జిల్లా నడికూడ మండలం, రాయపర్తి గ్రామంలో శిల్పకళ, వాస్తు శిల్పి శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను గ్రామ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ వేడుకల్లో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బాణాల శ్రీనివాస్, గంగోజుల రాజమౌళి, సత్యనారాయణ, భిక్షపతి, బాణాల వీరస్వామి, రాజమౌళి, సతీష్, రమేష్, సుధాకర్, హయగ్రీవ చారి, రాకేష్, గూడూరు రవి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం


## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** తమ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అన్నివేళలా అండగా ఉంటామని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆత్మకూరు మండలం కటాక్షపూర్ గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు శిరంశెట్టి సుమన్ తండ్రి నరసింహ రాములు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న చల్లా ధర్మారెడ్డి వారి గృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నరసింహరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, ప్రధాన కార్యదర్శి బుల్లోడు కుమారస్వామి, దామెర మాజీ వైస్ ఎంపీపీ ఎండీ జాకీర్ అలీ, దామెర మండల అధ్యక్షులు గండు రాము, మాజీ ఏఎంసీ చైర్మన్ కాంతల కేశవరెడ్డి, మాజీ సర్పంచులు సాహోరే కమల, రాజేశ్వర రావు, యాదగిరి, కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# పోలీసుల కళాబృందం ప్రదర్శన

**వరంగల్ వాయిస్, శాయంపేట :** వరంగల్ నగర పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, శాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గోవిందపురం గ్రామంలో పోలీసుల జాగృతి కళాబృందం బుధవారం సాయంత్రం ప్రదర్శన నిర్వహించింది. యువతను గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి మాదక ద్రవ్యాల బారినుంచి రక్షించడం, అలాగే పలు సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కళాబృందం సభ్యులు పాటలు, నాటికల ద్వారా అనేక విషయాలను వివరించారు. గంజాయి, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు, వాటిని అమ్మడం లేదా సేవించడం చట్టరీత్యా నేరమని వివరించారు. అలాంటి సమాచారం తెలిస్తే 8712584473 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. చదువు ప్రాముఖ్యత, రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలు, బాల కార్మికుల సమస్యలు, అలాగే వృద్ధాప్యంలో తల్లిదండ్రులను బాగా చూసుకోవాల్సిన బాధ్యత గురించి వివరించారు. సైబర్ నేరాలు, బెట్టింగ్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నాటిక ద్వారా ప్రదర్శించారు. సైబర్ నేరాలకు సంబంధించి ఏదైనా సహాయం కావాలంటే 1930 సైబర్ హెల్ప్‌లైన్




నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. డయల్ 100, సీసీటీవీ కెమెరాల ఉపయోగాలు, మూఢనమ్మకాలపై అవగాహన కల్పించడానికి మ్యాజిక్ షోలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి శాయంపేట ఎస్.ఐ.పరమేశ్, ఏ.ఎస్.ఐ. కుమారస్వామి, ఇతర పోలీస్ అధికారులు, కళాబృందం ఇంఛార్జి ఉమెన్ ఏ.ఎస్.ఐ. నాగమణి, సభ్యులు, హెడ్ కానిస్టేబుల్స్ విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, పీసీ పూల్ సింగ్, హోమ్ గార్డ్స్ శ్రీనివాస్, నారాయణ, చిరంజీవి, గ్రామ ప్రజలు సుమారు 350 మంది హాజరయ్యారు.

# బీఆర్ఎస్ లో భారీగా చేరికలు



**వరంగల్ వాయిస్, పరకాల :** నియోజకవర్గంలోని మల్లక్కపేట గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఆ పార్టీలకు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.బీజేపీ నుంచి గ్రామ అధ్యక్షులు బండి ఉదయ్ కిరణ్, తాళ్ల ప్రదీప్, బూత్ కమిటీ అధ్యక్షులు గురజాల శివరాజు, బొజ్జమ్ శివ, కాంగ్రెస్ నుంచి బూత్ కమిటీ అధ్యక్షులు చెన్న రాజేందర్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని తీవ్రంగా విమర్శించారు. యూరియా దొరకక రైతులు చెప్పులను క్యూ లైన్లలో పెట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదింటి ఆడబిడ్డలకు తులం బంగారం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ పథకం ఆగిపోయిందని, కాంగ్రెస్ ఇచ్చిన “420 హామీలు”, “ఆరు గ్యారంటీలు” అమలుకు నోచుకోలేదని ఎద్దేవా చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, మోసాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచులు సుమాల శ్రీనివాస్, బయ్యా రాజేందర్, గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లియాఖత్ అలీఖాన్‌కు నాయిని నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరానికి చెందిన రిటైర్డ్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మహ్మద్ లియాఖత్ అలీఖాన్ మరణం పట్ల వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిన్న రాత్రి అనారోగ్యంతో కన్నుమూసిన లియాఖత్ అలీఖాన్ పార్థివ దేహానికి ఆయన స్వగృహమైన హనుమకొండలోని కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సబ్ ఇన్‌స్పెక్టర్‌గా తన వృత్తిని ప్రారంభించి, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పదవీ విరమణ పొందిన లియాఖత్ అలీఖాన్, ప్రజలకు న్యాయం జరిగేలా నిరంతరం కృషి చేశారని ఎమ్మెల్యే నాయిని గుర్తుచేసుకున్నారు. అటువంటి ఆప్తమిత్రుడిని కోల్పోవడం తనకు వ్యక్తిగతంగా ఎంతో బాధ కలిగించిందని విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ అబూబకర్, యూనిస్ ఉన్నారు.

# వైభవంగా ‘శ్రీకృష్ణ రాయబారం’ నాటకం



**వరంగల్ వాయిస్, జనగాం :** సాయిరాం ఎంక్లేవ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ‘శ్రీకృష్ణ రాయబారం’ నాటక ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. ఈ ప్రదర్శనలో పాండవోద్యోగం ఘట్టం విశేషంగా ఆకట్టుకుంది. ధర్మరాజు పాత్రలో సీనియర్ జర్నలిస్ట్ కొండ శ్రీనివాస్ రావు, శ్రీకృష్ణుడిగా విశ్రాంత ఉద్యోగి రమణా రెడ్డి పలికిన డైలాగులు, పద్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వారి అద్భుతమైన నటన, సంభాషణలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి.

# సరిపడా యూరియా నిల్వలు

◆ ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్



**వరంగల్ వాయిస్, జనగామ :** బచ్చన్నపేట మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘాన్ని గురువారం ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఆయన యూరియా నిల్వలను, స్టాక్ రిజిస్టర్‌ను, మరియు రైతువారి సేల్ రిజిస్టర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడకుండా యూరియాను సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. బచ్చన్నపేట మండలంలో ఇప్పటివరకు 9 కేంద్రాలు, సబ్ సెంటర్ల ద్వారా రైతులందరికీ యూరియా సరఫరా జరుగుతోందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు వివిధ డీలర్ల ద్వారా 848 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ నెలలో మండలానికి 270 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటికే 198 మెట్రిక్ టన్నులు సరఫరా అయినట్లు తెలిపారు. అనంతరం ఇంచార్జి కలెక్టర్ పింకేష్ కుమార్ ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి, ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ, ఇందిరమ్మ ఇళ్ల పథకాల పురోగతిపై సమీక్షించారు. ఆయా పథకాలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ స్వరూప, మండల వ్యవసాయ అధికారి, ఏఈఓలు పాల్గొన్నారు.

# కార్డియాలజిస్ట్ డాక్టర్ చంద్రమోహన్‌కు అరుదైన గౌరవం

## ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



**వరంగల్ వాయిస్, నడికూడ :** హనుమకొండ జిల్లా నడికూడ మండలం కౌకొండ గ్రామానికి చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ మేకల చంద్రమోహన్ అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. హృదయ ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జేబీ ఫార్మా ఆధ్వర్యంలో నిర్వహించిన విశేష కార్యక్రమంలో పాల్గొన్నందుకు గాను ఆయనకు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి 'సర్టిఫికెట్ ఆఫ్ పార్టిసిపేషన్' లభించింది. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వందలాది మంది వైద్యులు పాల్గొన్నారు. "మ్యాక్సిమమ్ నంబర్ ఆఫ్ డాక్టర్స్ టేకింగ్ ఏ ప్లెడ్జ్ ఫర్ గుడ్ హార్ట్ హెల్త్" (గుండె ఆరోగ్యంపై ప్రమాణం చేసిన అత్యధిక సంఖ్యలో వైద్యులు) అనే విభాగంలో రికార్డు సృష్టించడానికి డాక్టర్ చంద్రమోహన్ తన సేవలను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ, "హృదయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. సరైన ఆహారం, వ్యాయామం, ఒత్తిడిని నియంత్రించుకోవడం ద్వారా గుండె సంబంధిత వ్యాధులను నివారించవచ్చు. అంతేకాకుండా, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి" అని సూచించారు. స్థానికంగా ప్రజల ఆరోగ్యానికి కృషి చేస్తూ, వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ చంద్రమోహన్ ఈ గౌరవం అందుకోవడంతో గ్రామస్తులు, సహచరులు ఆనందం వ్యక్తం చేశారు. యువ వైద్యులకు ఇది ప్రేరణగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ అరుదైన గౌరవాన్ని పొందినందుకు గాను పలువురు ప్రజా ప్రతినిధులు, వైద్యులు, విద్యార్థులు ఆయనను అభినందించారు. డాక్టర్ చంద్రమోహన్ కేవలం వైద్య సేవలకే పరిమితం కాకుండా, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాల ద్వారా సమాజానికి సేవలు అందిస్తున్నారు. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు ఆయన అంకితభావానికి, కృషికి దక్కిన గుర్తింపు అని చెప్పవచ్చు.

# ఎన్‌డీపీఎస్ కేసు నమోదు

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్‌డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) చట్టం కింద ఒక కేసు నమోదైంది. ఈ కేసులో మొత్తం ఐదుగురిని నిందితులుగా చేర్చినట్లు పోలీసులు తెలిపారు. 2017లో నమోదైన ఈ కేసు (క్రైమ్ నంబర్: 21/2017) ఇప్పుడు 1వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టులో విచారణలో ఉంది. సెక్షన్ 8 (సి) ఆర్/డబ్ల్యూ 20 (బి)(ii)(బి) ఆఫ్ ఎన్‌డిపిఎస్ చట్టం కింద ఈ కేసు నమోదు చేయబడింది. పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.ఉపేందర్ రావు ఫిర్యాదుదారుగా ఉన్నారు. ఈ కేసులో నిందితులుగా నరిగే రాజయ్య (మరణించారు), లవుడియా బద్రమ్మ, దుప్పటి మల్లయ్య, బొల్ల ఇలయ్య, దాసరి కుమారస్వామిలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును 1వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి బి.అపర్ణాదేవి విచారిస్తున్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బి. రాజమల్ల రెడ్డి వ్యవహరిస్తున్నారు. అప్పటి దర్యాప్తు అధికారి పి.కిషన్ కాగా, ప్రస్తుతం ఈ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా వి.చేరాలు కొనసాగుతున్నారు. కోర్టు లైజన్ ఆఫీసర్‌గా కె.పరమేశ్వరి, సీడీఓగా వలబోజు రవీందర్ ఉన్నారు. ఈ కేసు విచారణ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.

# జర్నలిస్ట్ సురేష్ కు పరామర్శ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల కేంద్రానికి చెందిన జర్నలిస్ట్ సముద్రాల సురేష్ తల్లి సుగుణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకులు రేవూరి జలంధర్ రెడ్డి గురువారం సురేష్ ఇంటిని సందర్శించి, సుగుణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం, జలంధర్ రెడ్డి సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సముద్రాల విజేందర్, కందకట్ల రాము తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు మల్కాపూర్ విద్యార్థి



**వరంగల్ వాయిస్, చిల్పూర్ :** మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన జ్యోతినికేతన్ హైస్కూల్ విద్యార్థి భోగి అభినయ్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని షూటింగ్ బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ కుమార్ తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ పట్టణంలోని శ్రీవాణి గురుకులంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో అభినయ్ తన ప్రతిభను చాటుకుని రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు. ఈ సందర్భంగా అన్వేష్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22, 23, 24 తేదీలలో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలో జరిగే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. అభినయ్ రాష్ట్రస్థాయికి ఎంపికైనందుకు చిల్పూర్ మండల షూటింగ్ బాల్ ప్రెసిడెంట్ రంజిత్ రెడ్డి, చైర్మన్ ఉరడి సతీష్, సెక్రటరీ గోనెల అజయ్, జ్యోతినికేతన్ పాఠశాల హెచ్.ఎం.మేరి జెయిన్, షూటింగ్ బాల్ కమిటీ సభ్యులు అభినందించారు

# డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 24 మందికి శిక్ష పడింది. వారిని గురువారం గౌరవ మేజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం ఎదుట హాజరుపరచగా ఈ తీర్పు వెలువడింది. పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్, అడిషనల్ డీసీపీ ఆర్.ప్రభాకర్ రావు, ఏసీపీ టి.సత్యనారాయణ పర్యవేక్షణలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు జరిగాయి. పట్టుబడిన 24 మందిలో ఇద్దరికి జైలు శిక్ష విధించగా, మిగిలిన 22 మందికి భారీ జరిమానా విధించారు. ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష విధించి హుజూరాబాద్ సబ్ జైలుకు పంపించారు. మిగిలిన 22 మందికి కలిపి మొత్తం రూ. 27,000 జరిమానా విధించారు. అదే విధంగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులను కూడా కోర్టులో హాజరుపరచగా, వారికి రూ. 1500 చొప్పున జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. సుజాత తెలిపారు.

# సుష్మా స్వరాజ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

## మాజీ మేయర్ డాక్టర్ తక్కళ్ల పల్లి రాజేశ్వరరావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకురాలు సుష్మా స్వరాజ్ కాంస్య విగ్రహాన్ని వరంగల్‌లో ఏర్పాటు చేయాలని మాజీ మేయర్ డాక్టర్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు గొర్రెల మేకల పెంపకదారుల కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీజేపీ సీనియర్ నేత అన్నబోయిన రాజయ్య యాదవ్ కూడా పాల్గొన్నారు. డాక్టర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు పార్లమెంట్‌లో సుష్మా స్వరాజ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారని గుర్తు చేశారు. అందుకే ఆమె విగ్రహాన్ని వరంగల్‌లో, అలాగే హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించి సముచితంగా గౌరవించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విగ్రహం ఏర్పాటుకు రాజకీయాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షులు మంద ఐలయ్య, వంగాల సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

# క్రిస్టియన్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

◆ దీపక్ జాన్ కొక్కడన్



**వరంగల్ వాయిస్, జనగామ :** తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ కొక్కడన్, క్రిస్టియన్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గురువారం జనగామ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇంచార్జి కలెక్టర్ పింకేష్ కుమార్, అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్తో కలిసి ఆయన పాస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ దీపక్ జాన్ మాట్లాడుతూ నిరుపేద క్రిస్టియన్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రతి ఆదివారం చర్చిల్లో ప్రచారం చేయాలని పాస్టర్లకు సూచించారు. ప్రధానంగా నాలుగు అంశాలపై చర్చించినట్లు ఆయన వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో శ్మశాన వాటికలు, కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చర్చిల నిర్మాణాలకు అనుమతులు, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు వంటి సమస్యలను ప్రభుత్వ నిబంధనల మేరకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. క్రిస్టియన్ల జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి, తమ సమస్యలను విజ్ఞాపన పత్రం ద్వారా కలెక్టర్‌కు ఇవ్వాలని, దాని కాపీని తనకు వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు. జిల్లా ఇంచార్జి కలెక్టర్ పింకేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో జనాభా లెక్కల ప్రకారం సుమారు 6 వేల మంది క్రిస్టియన్లు ఉన్నారని తెలిపారు. జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల్లో బరియల్ గ్రౌండ్‌లకు చర్యలు తీసుకుంటామని, మున్సిపాలిటీల్లో కమ్యూనిటీ హాళ్లను కేటాయించామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు. చర్చి అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ బి.విక్రమ్ కుమార్, జిల్లాలోని వివిధ చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం

◆ ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అభినందనీయమని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి అన్నారు. వరంగల్ రంగశాయిపేటలోని బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్లో బుధవారం వడుప్స (వరంగల్ డిస్ట్రిక్ట్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం జరిగింది. వడుప్స వరంగల్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆడెపు శ్యామ్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, నిస్సా జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జె.ఎస్. పరంజ్యోతి, వరంగల్ మండల ఎంఈఓ ఎస్.వెంకటేశ్వరరావు, ట్రస్మా రాష్ట్ర కార్యదర్శి ఎన్.వెంకటేశ్వర రావులు హాజరై ముందుగా సరస్వతి, సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుల మాదిరిగానే ప్రైవేట్ ఉపాధ్యాయులు క్రమశిక్షణతో, నిబద్ధతతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఇలాంటి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మానించడం అభినందనీయమని కొనియాడారు. వరంగల్ మండల ఎంఈఓ ఎస్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రైవేట్ ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తున్న వడుప్స జిల్లా కమిటీకి అభినందనలు తెలిపారు. డాక్టర్ జె.ఎస్. పరంజ్యోతి మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు తమ బాధ్యత మరింతగా పెరిగిందని గుర్తించి, విద్యార్థుల అభివృద్ధికి మరింత శ్రమించాలని ఆకాంక్షించారు. ఆడెపు శ్యామ్ మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో వృత్తిని దైవంగా భావించి పనిచేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించడం సంతోషంగా ఉందని, ఈ అవార్డులు వారికి మరింత స్ఫూర్తినిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా వడుప్స జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లా రవి, జిల్లా కోశాధికారి ఠాగూర్ జ్ఞానేశ్వర్ సింగ్, జిల్లా సలహాదారులు కొడెం. శ్రీధర్, హడుప్స జిల్లా అధ్యక్షులు టి.బుచ్చి బాబు, హడుప్స జిల్లా కార్యదర్శి సంతోష్ రెడ్డి, జిల్లా సలహాదారులు జనార్దన్, వడుప్స జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆడెపు వెంకటేశ్వర్లు, ఖిలా వరంగల్ జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్, వరంగల్ జోన్ అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్, ఇతర నాయకులు, సుమారు 150 మంది ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన పాఠశాల కరస్పాండెంట్ మిత్రులకు, ఉపాధ్యాయులకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ సేవ దళ్ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడిగా తాళ్లపల్లి రాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని వడ్డేపల్లి ప్రాంతానికి చెందిన తాళ్లపల్లి రాజు కాంగ్రెస్ పార్టీ సేవా దళ్ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. హనుమకొండ జిల్లా సేవా దళ్ అధ్యక్షులు బొచ్చు చందర్ ఈ నియామకాన్ని ఖరారు చేయగా, నియామక పత్రాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా తాళ్లపల్లి రాజు అందుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ సేవా దళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ సేవా దళ్ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి సుంకరి శ్రీనివాస్ రెడ్డి, మరియు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ సేవా దళ్ అధ్యక్షులు బొచ్చు చందర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తీసుకునే ప్రతి కార్యక్రమంలో పూర్తి స్థాయిలో పాల్గొని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తాళ్లపల్లి రాజు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# సాయుధ పోరాట విరమణ హర్షణీయం

తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మావోయిస్టు పార్టీ సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ప్రకటించడంపై భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు హర్షం వ్యక్తం చేశారు. మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో విడుదలైన ప్రకటనను ఆయన స్వాగతించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పీడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరాటాలలో పాల్గొంటామని అభయ్ పేర్కొనడం ఆహ్వానించదగిన పరిణామమని వెంకట్రాములు అన్నారు. ఈ అత్యంత ముఖ్యమైన అంశంపై తమ నాయకత్వంతో చర్చించడానికి నెల రోజుల సమయం కోరిన మావోయిస్టుల విజ్ఞప్తిపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ మావోయిస్టులను ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని చేసిన విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అభయ్ ప్రకటించడాన్ని ఆయన ప్రస్తావించారు. కేంద్ర హోం మంత్రి లేదా ఆయన నియమించిన ప్రతినిధి బృందంతో చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించడం వారి విధానంలో వచ్చిన మార్పును తెలియజేస్తోందని వెంకట్రాములు అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యపై సానుకూలంగా స్పందించి, సైనిక దాడులు, ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నక్సలైట్ సమస్యను కేవలం ఒక చట్టబద్ధమైన సమస్యగా కాకుండా, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యగా పరిగణించి, శాంతి చర్చలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడానికి తగిన చర్యలు చేపట్టాలని వెంకట్రాములు కోరారు.

# దసరా ఉత్సవాల ఏర్పాట్లపై మంత్రి కొండా సురేఖకు వినతి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గలో జరగనున్న దసరా ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి సభ్యులు గురువారం రాష్ట్ర మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు ధూపం సంపత్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ సమితి సభ్యులు మాట్లాడుతూ కాశిబుగ్గ దసరా ఉత్సవాలకు ఐదు డివిజన్ల ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉత్సవాలకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని కోరారు. ముఖ్యంగా, మున్సిపల్ సిబ్బందితో మైదానాన్ని శుభ్రం చేయించడం, లైటింగ్, సౌండ్ సిస్టం, స్టేజి, బారికేడ్లు, నీటి సరఫరా, పోలీసు బందోబస్తు, విద్యుత్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది వంటి అన్ని ఏర్పాట్లు చేయాలని అభ్యర్థించారు. అలాగే, డీపీఆర్ఓ సహకారంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. దసరా ఉత్సవాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ గుల్లపల్లి రాజ్‌కుమార్, కన్వీనర్ భయ్యా స్వామి, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# హలో లంబాడి 'చలో హైదరాబాద్'



**వరంగల్ వాయిస్, కేయూ :** 'హలో లంబాడి.. చలో హైదరాబాద్' అనే నినాదంతో రేపు హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న లంబాడీల ఆత్మగౌరవ సభకి కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పెద్ద ఎత్తున ఈ సభకు తరలి వెళ్తున్నట్లు కాకతీయ యూనివర్సిటీ లంబాడీ రిజర్వేషన్ ప్రొటెక్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ విద్యార్థి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎల్ ఆర్పీ-జాక్ కన్వీనర్ వెంకట్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని లంబాడీలంతా ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. లంబాడీలు ఈ దేశ మూలవాసులని తెలియజేస్తూ, ఆత్మగౌరవ పోరాటంలో విద్యార్థులు, లంబాడీలు ఏకతాటిపై వచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కొంతమంది స్వార్థ నాయకులు గిరిజనుల మధ్య చిచ్చురేపడానికి చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని కాకతీయ యూనివర్సిటీ ఎల్ ఆర్పీ-జాక్ కన్వీనర్ రమేష్ నాయక్ అన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని లంబాడీలు సొంత ఖర్చులతో తరలి వచ్చి మన ఆత్మగౌరవాన్ని చాటాలని, పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు డా.వెంకటేశ్వర్లు, అశోక్, సందీప్, కళ్యాణ్, సుధీర్, తిరుపతి, నరేష్, వీరేందర్, అనిల్, యాకూబ్, ఆలోజి, చరణ్, అఖిల్, సూర్య, సుమన్ నాయక్, స్నేహ, నవ్య, భరత్, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పీడీఎస్ బియ్యం పట్టివేత



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కమలాపూర్ మండలం మర్రిపల్లి గ్రామంలో గురువారం ఈ ఘటన జరిగింది. టాస్క్‌ఫోర్స్ బృందానికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు మర్రిపల్లికి చెందిన తుమ్మల రమేష్ (45) ఇంట్లో దాడి చేశారు. ఈ దాడిలో సుమారు 9.6 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.33,600 ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. రమేష్ కమలాపూర్ మండలం పరిసర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి అక్రమంగా డంప్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు నిందితుడు రమేష్‌ను అదుపులోకి తీసుకుని, స్వాధీనం చేసుకున్న బియ్యంతో సహా తదుపరి చర్యల కోసం కమలాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఎస్ఐ వీరాస్వామి, టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు, కమలాపూర్ పోలీసులు పాల్గొన్నారు.

# మహిళల ఆధ్యాత్మిక శక్తికి ప్రతీక బొడ్డెమ్మ

◆ ఝాన్సీ రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, రాయపర్తి :** బొడ్డెమ్మ పండుగ స్త్రీలలోని ఆధ్యాత్మిక శక్తిని వెలికితీసే గొప్ప పండుగ అని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. రాయపర్తి మండలం, మైలారం గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించిన బొడ్డెమ్మ ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ వేడుకలకు హాజరైన ఝాన్సీ రాజేందర్ రెడ్డికి మహిళలు ఘనంగా స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం, ఆమె స్థానిక మహిళలతో కలిసి వీధిలోని బొడ్డెమ్మలను సందర్శించి, సాంస్కృతిక నృత్యాలు చేస్తూ, ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మైలారం గ్రామస్తులతో కలిసి పండుగలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ప్రకృతికి, మానవాళికి ఉన్న సంబంధాన్ని బొడ్డెమ్మ పండుగ తెలుపుతుందని ఆమె అన్నారు. గౌరమ్మ ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరికీ పంటలు బాగా పండి, సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరికీ బొడ్డెమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి, ఉల్కెంగుల నర్సయ్య, యాదగిరి, సుదర్శన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, యూత్ అధ్యక్షులు కోతి కళ్యాణ్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఎల్లా రెడ్డి, చిర్రా మల్లయ్య, కోటి, నయీమ్, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా కేసులో నలుగురికి 10 ఏళ్ల జైలు శిక్ష

## ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గంజాయి అక్రమ రవాణా కేసులో నలుగురు నిందితులకు హనుమకొండలోని 1వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టు న్యాయమూర్తి బి. అపర్ణాదేవి పదేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జరిమానా విధించారు. హసన్‌పర్తి మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, బైక్‌పై ఇద్దరు వ్యక్తులు మధ్యలో ఓ సంచి పెట్టుకుని వెళ్తూ పోలీసులను చూసి దాన్ని పడేసి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా, నరిగే రాజయ్య, దుప్పటి మల్లయ్య, బొల్ల ఇలోని, దాసరి కుమారస్వామి, లవుడియా బద్రమ్మ గంజాయి వ్యాపారంలో ఉన్నట్లు వెల్లడైంది. పోలీసుల విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించారు. లవుడియా బద్రమ్మ చెప్పిన వివరాల ప్రకారం, మల్లారెడ్డిపల్లికి చెందిన బొల్ల ఇలయ్య, దాసరి కుమారస్వామిల వద్ద రూ.1000 చొప్పున గంజాయి కొనుగోలు చేసి, దాన్ని నరిగే రాజయ్య ఇంట్లో దాచిపెట్టేవారు. ఆ గంజాయిని మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తికి రూ.6500 చొప్పున అమ్ముదామని తీసుకెళుతుండగా పట్టుబడ్డారని ఆమె తెలిపారు. పట్టుబడిన వారిలో నరిగే రాజయ్య (కొప్పుల గ్రామం, శాయంపేట), దుప్పటి మల్లయ్య (పూలకుర్తి గ్రామం, ఆత్మకూరు), బొల్ల ఇలయ్య (మల్లారెడ్డిపల్లె), దాసరి కుమారస్వామి (మల్లారెడ్డిపల్లె) ఉన్నారు. అప్పటి సీఐ పుల్యాల కిషన్ నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. రాజయ్య కేసును సమర్థవంతంగా వాదించారు. హసన్‌పర్తి సీఐ వి. చెరాలు కేసు పర్యవేక్షణ చేసి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ అనంతరం, న్యాయమూర్తి అపర్ణాదేవి ఈ నలుగురు నిందితులకు పదేళ్ల జైలు శిక్షతో పాటు భారీ జరిమానా విధించారు. నిందితులలో ఒకరైన నరిగే రాజయ్య కేసు విచారణ దశలో మరణించారు. ఈ మేరకు కోర్టు కానిస్టేబుల్ బి. రవీందర్ వివరాలను వెల్లడించారు.

# ఉడుగుల లింగమ్మ కన్నుమూత



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండలంలోని బానాజీపేట గ్రామానికి చెందిన సీపీఐ పార్టీ సీనియర్ నాయకురాలు ఉడుగుల లింగమ్మ అనారోగ్యంతో గురువారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఐ మండల కమిటీ బాధ్యులు గ్రామానికి చేరుకుని ఆమె భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లింగమ్మ మృతి పట్ల సీపీఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆమె మరణం పార్టీకి తీరని లోటని ఆయన అన్నారు. లింగమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో సీపీఐ గ్రామ కార్యదర్శి ముప్పిడి ఎల్లయ్య, మండల సహాయ కార్యదర్శి కందుకూరి మల్లేశం, ఉడుగుల జయమ్మ, శాడ ఎల్లయ్య, కందుకూరి శోభన్ బాబు, గొరిగే శ్రీశైలం, ఉడుగుల నరసయ్య, నాగయ్య, శీను తదితరులు ఉన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ లో ఇద్దరికి జైలు శిక్ష



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, హనుమకొండ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన పది మంది వ్యక్తులను గురువారం మేజిస్ట్రేట్ ఎ. వేణుగోపాల్ ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ ఇద్దరికి జైలు శిక్ష విధించగా, మిగిలిన ఎనిమిది మందికి జరిమానా విధించారు. ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష విధించి హుజురాబాద్ సబ్ జైలుకు పంపించారు. మిగిలిన ఎనిమిది మందికి కలిపి మొత్తం రూ.8,500 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతా రెడ్డి తెలిపారు. అదేవిధంగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఒక వ్యక్తిని కోర్టులో హాజరుపరచగా, అతనికి కూ. 8,500 జరిమానా విధించినట్లు సీఐ సీతా రెడ్డి వెల్లడించారు.

# 22 నుంచి పద్మాక్షి శరన్నవరాత్రి ఉత్సవాలు

## ◆ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని చారిత్రక శ్రీ పద్మాక్షి దేవాలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన వేద పండితులు, ట్రస్ట్ కోశాధికారి నాగిళ్ళ షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. సుమారు 2000 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో గత 500 సంవత్సరాలుగా నాగిళ్ల వారి వంశపారంపర్యంగా ఉత్సవాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది శ్రీ హనుమద్గిరి పద్మాక్షి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించబడుతున్నాయి. సెప్టెంబర్ 22, సోమవారం ఉదయం జ్యోతి ప్రజ్వలన, గోపూజ, గణపతి పూజ, కలశస్థాపనతో యాగం ప్రారంభమవుతుంది. ప్రతిరోజు అభిషేకం, చండీహోమం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయి. సెప్టెంబర్ 27న లక్ష పుష్పార్చన, సెప్టెంబర్ 29న మూలనక్షత్రం సందర్భంగా సరస్వతి అలంకరణ, చద్దల బతుకమ్మ వేడుకలు, అక్టోబర్ 1న మహాపూర్ణాహుతి, అక్టోబర్ 2న విజయదశమి (దసరా), అక్టోబర్ 3న మహాస్నపనం, సాయంత్రం రథోత్సవం, అక్టోబర్ 4న ఉదయం శాంతి కళ్యాణం, సాయంత్రం తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఆలయం కొండపైన ఉన్నందున భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ట్రస్ట్ సభ్యులు జిల్లా యంత్రాంగాన్ని కోరారు. కొండపైకి రహదారి, తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్, శానిటైజర్స్, పార్కింగ్ వసతులను కల్పించాలని కోరారు. ఈ విషయమై పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ద్వారా కలెక్టర్, పోలీస్ కమిషనర్, మేయర్‌కు విజ్ఞాపన పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ అర్చకులు నాగిళ్ళ శంకర్ శర్మ, నాగిళ్ల రామశాస్త్రి, కొండూరి పశుపతి ఈశ్వర్నాథ్, శ్యాంసుందర్ రెడ్డి, వేముల శ్రీనివాస్, నాగేందర్, మునిగోటి రమేష్, నీలారపు రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు, రవికుమార్, వేద పండితులు రావుల కిషన్ కోమల, ట్రస్ట్ అధ్యక్షుడు నాగిళ్ళ రామశాస్త్రి, కార్యదర్శి నాగిళ్ళ శంకర్ శర్మ, కనుకుంట్ల రవికుమార్, నీలారపు రాజ్‌కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# 20 నుంచి బాలల సంరక్షణ కేంద్రాల తనిఖీ

◆ నిర్వాహకులు కనీస ప్రమాణాలు పాటించాలి

◆ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలు (చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్) తప్పనిసరిగా కనీస ప్రమాణాలు పాటించాలని హనుమకొండ అదనపు కలెక్టర్ ఏ. వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఇన్‌స్పెక్షన్ కమిటీ, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశం జిల్లా సంక్షేమ అధికారి జె. జయంతి అధ్యక్షతన జరిగింది. సెప్టెంబర్ 20 నుంచి 26 వరకు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను అదనపు కలెక్టర్‌తో పాటు ఆరుగురు సభ్యుల కమిటీ తనిఖీ చేస్తుందని వెంకట్ రెడ్డి తెలిపారు. ఈలోగా అన్ని సంస్థలు కనీస ప్రమాణాలు పాటించాలని, లేని పక్షంలో ఇన్‌స్పెక్షన్ కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలబాలికలకు వసతి, భోజనం, విద్య, వైద్యంతో పాటు సరైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడేలా వివిధ శాఖల టోల్ ఫ్రీ నంబర్లను ప్రదర్శించాలని ఆదేశించారు. అలాగే, భవనాల ఫిట్‌నెస్, వాటర్ ప్యూరిఫికేషన్, శానిటేషన్ సర్టిఫికెట్లను సంబంధిత శాఖల నుండి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జె. జయంతి మాట్లాడుతూ, పిల్లలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో రూపొందించిన ఫార్మాట్ ప్రకారం అన్ని సంస్థలు పిల్లల హెల్త్ ప్రొఫైల్స్ నిర్వహించుకోవాలని కోరారు. అందుబాటులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా బాలల ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. అడిషనల్ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ మదన్ మోహన్ రావు మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాలలోని పిల్లలకు హెల్త్ ప్రొఫైల్స్ నిర్వహించడానికి స్థానిక పీహెచ్‌సీ అధికారులకు సమాచారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ సీహెచ్.అవంతి, జిల్లా బాలల పరిరక్షణ ఇంచార్జి అధికారి ఎస్. ప్రవీణ్ కుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్, డాక్టర్ పరికి సుధాకర్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.మౌనిక, అధికారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# సేవా పక్వాడాలో భాగంగా స్వచ్ఛ భారత్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్న 'సేవా పఖ్వాడా' (సేవా పక్షోత్సవాలు)లో భాగంగా హనుమకొండలో 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో గురువారం న్యూ శాయంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు బెజ్జంకి పూర్ణచారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ "ప్రధాని మోదీ నిస్వార్థ సేవ, దేశాభివృద్ధికి ఆయన పడుతున్న తపన ప్రతి ఒక్కరికీ ఆదర్శం. అందుకే ఆయన జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా, ప్రజాసేవతో జరుపుకోవాలనే సంకల్పంతో 'సేవా పఖ్వాడా'ను నిర్వహిస్తున్నాం" అని అన్నారు. స్వచ్ఛత ఉన్నచోటే ఆరోగ్యం, అభివృద్ధి ఉంటాయనే ప్రధాని మోదీ పిలుపు స్ఫూర్తితో పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయడం ద్వారా విద్యార్థులలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి, పరకాల నియోజకవర్గ నాయకులు డాక్టర్ పగడాల కాళిప్రసాద్ హాజరయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తోందని, ఆయన ఆయురారోగ్యాలతో దేశానికి మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రపరిచారు. బీజేపీ హనుమకొండ జిల్లా 31వ డివిజన్ అధ్యక్షులు కడవేరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో డివిజన్ నాయకులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జ సత్యనారాయణ రావు, జిల్లా నాయకులు ఆర్.పి జయంత్ లాల్, కూతురు రాజ్‌కుమార్, కందగట్ల సత్యనారాయణ, ఇతర డివిజన్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సెప్టెంబర్ సినిమాలకు కలిసి వచ్చింది

### కిష్కింధపురి సక్సెస్ మీట్‌లో అనిల్ రావిపూడి

ఈ సెప్టెంబర్‌లో థియేటర్‌లు కళకళలాడుతున్నాయని అనిల్ రావిపూడి పేర్కొన్నారు. ఇది సక్సెస్‌ఫుల్ సెప్టెంబర్ అన్నారు. వరుస సినిమాలతో పండగ వాతావరణం నెలకొందని.. ఇదే కొనసాగాలని కోరుకుంటున్నానని అన్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కిష్కింధపురి' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. తాజాగా ఆడియన్స్‌కు ధన్యవాదాలు చెబుతూ టీమ్ హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ ఈవెంట్‌కు దర్శకుడు అనిల్ రావిపూడి, బాబీ, అనుదీప్, వశిష్ఠలతో పాటు– హీరో సాయి దుర్గా తేజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హారర్ సినిమాలు ఎలా ఉన్నా అందరూ ఆదరణ సొంతం చేసుకుంటాయని అందరూ అనుకుంటారు. కానీ, వాటిలో కంటెంట్ ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వాళ్ల నాన్న ఎంత పెద్ద నిర్మాతో అందరికీ తెలిసిందే. అయినా సాయి మాత్రం ఏ సినీ నేపథ్యం లేనట్లు– కష్టపడుతుంటాడు. అనిల్ రావిపూడి– చిరంజీవి కాంబినేషన్‌లో రానున్న సినిమాలో కొన్ని సన్నివేశాలు చూశాను. చాలా బాగున్నాయి. కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుంది. ఈ సినిమాతో విజయాన్ని సొంతం చేసుకున్న నిర్మాత సాహు గారపాటి.. సంక్రాంతికి చిరంజీవి చిత్రంతో మరోసారి మంచి ఫలితాలు చూస్తారని బాబీ నమ్మకంగా చెప్పారు.తెలుగు సినిమాలకు థియేటర్‌లలో జనాలు రావడం లేదని ఈ మధ్య కామెంట్స్ వినిపించాయి. కానీ, సెప్టెంబర్‌ను మాత్రం ఆడియన్స్ సెలబ్రేట్ చేసుకున్నారు. సాయి దుర్గాతేజ్ అంటే నాకు చాలా ఇష్టం. ఒక బ్రదర్‌గా ఆయన ఎప్పుడూ నాకు తోడున్నారని సాయి శ్రీనివాస్ తెలిపారు.








# ఏఎన్నార్ 101 జయంతి స్పెషల్

- డాక్టర్ చక్రవర్తి, ప్రేమాభిషేకం రీ-రిలీజ్
- థియేటర్లలో ఉచితంగా ప్రదర్శన

దివంగత అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతి సందర్భంగా అభిమానులకు ప్రత్యేక బహుమతి సిద్ధమైంది. ఆయన నటించిన సూపర్‌హిట్ క్లాసిక్ చిత్రాలు డాక్టర్ చక్రవర్తి, ప్రేమాభిషేకం మళ్లీ పెద్ద తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా, ఈ సినిమాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఎంపిక చేసిన థియేటర్లలో అది కూడా ఉచిత టిక్కెట్లతో ప్రదర్శించనున్నారు. ఇది నిజంగా అభిమానుల్లో విశేష ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ రెండు ప్రసిద్ధ చిత్రాలు సెప్టెంబర్ 20 నుంచి మళ్లీ రీ–రిలీజ్ అవుతున్నాయి. పెద్ద తెరపై ఏఎన్‌ఆర్ మాయాజాలాన్ని మళ్లీ ఆస్వాదించే అరుదైన అవకాశం ఇది. ఈ ప్రత్యేక ప్రదర్శనలకు టిక్కెట్లు– బుక్ మై షో లో ఉచిత రిజర్వేషన్ కోసం అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ఒంగోలు వంటి ప్రధాన నగరాల్లోని ప్రముఖ థియేటర్లలో ప్రదర్శనలు జరగనున్నాయి. వీటిలో వైజాగ్‌లో క్రాంతి థియేటర్, ఒంగోలులో స్వర్ణ ప్యాలెస్, విజయవాడలో కృష్ణ టాకీస్, అలాగే హైదరాబాద్‌లోని ఒక ప్రసిద్ధ థియేటర్ కూడా ఉన్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని కేంద్రాలను జోడించే అవకాశం ఉందని సమాచారం. ఏఎన్‌ఆర్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఆయన నటన, సిల్వర్ స్క్రీన్‌పై సృష్టించిన మాయాజాలాన్ని అభిమానులు మరోసారి ఆస్వాదించనున్నారు. అభిమానులు తమ తమ నగరాల్లోని థియేటర్లకు వెళ్లి, కుటుంబసభ్యులతో కలిసి ఈ క్లాసిక్ సినిమాలను చూసి ఆనందించాలని పిలుపునిచ్చారు.




# ఓజీ నుంచి

### ప్రకాష్ రాజ్ పోస్టర్ విడుదల

పవన్ కల్యాణ్ హీరోగా 'ఓజీ' సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా మేకర్స్ ఓ సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఇందులో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ పాత్రను పరిచయం చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. చిత్రంలో ఆయన 'సత్య దాదా' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో ప్రకాశ్ రాజ్ సీరియస్ లుక్‌లో కనిపించారు. పోస్టర్ ఆధారంగా ఆయన పాత్ర కీలకమని అర్థమవుతోంది. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా 'ఓజీ' రూపొందుతోంది. ఇందులో పవన్ ఇప్పటి వరకూ ఎన్నడూ చూడని పాత్రలో ఓజాస్ గంభీర అనే గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు.

# కల్కి-2 నుంచి తప్పుకున్న దీపిక



ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కల్కి 2898 ఏడీ' పార్ట్–2 నుంచి దీపక తప్పుకున్నారు. గతేడాది విడుదలైన ఈ చిత్రం భారతీయ సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్ ఉన్నట్లు– ఇప్పటికే చిత్రబృందం వెల్లడిరచిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ మూవీ టీమ్ సడెన్ షాక్ ఇచ్చింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. 'కల్కి' సీక్వెల్‌లో దీపిక భాగం కాదని అధికారికంగా తెలియజేస్తున్నాం. తొలి భాగం కోసం ఆమెతో సుదీర్ఘ ప్రయాణం చేసినప్పటికీ రెండో పార్ట్‌లో భాగస్వామి కాలేకపోయింది. గొప్ప టీమ్‌తో కల్కి సీక్వెల్ మీా ముందుకు వస్తుంది. భవిష్యత్తులో దీపిక మంచి సినిమాలతో అలరించాలని కోరుకుంటున్నాం అని వైజయంతీ మూవీస్ పోస్ట్ పెట్టింది.

# కుటుంబ గొడవలతో మౌనంగా ఉన్నా

### దక్ష ప్రమోషన్‌లో వెల్లడించిన మంచు లక్ష్మి

ఇంట్లో ఎవరు హిట్ అందుకున్నా.. అది అందరి విజయంగా భావించి ఆనందిస్తానని నటి మంచు లక్ష్మి అన్నారు. తన తండ్రి మోహన్‌బాబుతో కలిసి ఆమె నటించిన యాక్షన్ చిత్రం 'దక్ష' 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రచారంలో ఆమె బిజీగా ఉన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమ కుటుంబంలో జరిగిన గొడవలపై మాట్లాడారు. మిరాయ్' విజయాన్ని నేను కూడా ఎంజాయ్ చేస్తున్నాను. కుటుంబంలో ఎవరికి సక్సెస్ వచ్చినా మా అందరిదిగా భావించి ఆనందిస్తా. ఒకరి కష్టం వృథా కావాలని ఎప్పుడూ కోరుకోను. జీవిత పాఠాలు నేర్చుకోవాలి అనుకుంటాను.. కానీ, కష్టానికి ప్రతిఫలం రాకుండా ఉండాలని ఎప్పుడూ కోరుకోను. ఎందుకంటే ఈ రంగంలో ఎన్ని ఇబ్బందులు ఉంటాయో నాకు తెలుసు. ఒక ఆర్టిస్ట్‌గా వాళ్లకు సలహాలు ఇస్తాను. 'మిరాయ్' సక్సెస్‌ను ఎంజాయ్ చేయమని మొన్న కలిసినప్పుడు కూడా మనోజ్‌కు చెప్పానని అన్నారు. ఒక కుటుంబంలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు అందరూ నలిగిపోతారు. అలా జరగదు అని చెప్పడం అబద్ధం. కానీ, మేము ఉండేది అద్దాల మేడలో.. ఏం చెప్పినా తల, తోక కట్ చేసి వాళ్లకు నచ్చినట్లు– రాసుకునే రోజులివి. అలాంటప్పుడు సైలెంట్‌గా ఉండడమే ఉత్తమం అని నాకు అనిపించింది. అందుకే మౌనంగా ఉన్నాను. గతంలో ఏది ఒప్పు, ఏది తప్పు అని ఆలోచించేదాన్ని. ఇప్పుడు అలా ఆలోచించడం లేదు. దీని వల్ల నేను ఆనందంగా ఉంటానా, బాధపడతానా అని ఆలోచిస్తున్నాను. జీవితంలో ఏదైనా మనకు ఒక పాఠం నేర్పడానికే వస్తుంది. ఏది జరిగినా మౌనంగా ఆలోచిస్తే ప్రశాంతత లభిస్తుందని మంచు లక్ష్మి చెప్పారు.





# స్వచ్ఛతే బీజేపీ లక్ష్యం

- జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- 35వ డివిజన్ లో రహదారులు శుభ్రం చేసిన నేతలు

**వరంగల్ వాయిస్, శివనగర్ :** భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని 'సేవా పక్షం' కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గురువారం నగరంలోని 35వ డివిజన్ పరిధి శివనగర్ మండల ప్రధాన కార్యదర్శి వైట్ల గణేష్ ఆధ్వర్యంలో పుప్పాలగుట్ట ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొని బీజేపీ నాయకులతో కలిసి రహదారులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రధాని మోడీ సబ్కా సాథ్ –సబ్కా వికాస్ అనే నినాదంతో దేశ ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పేదల సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉద్యోగ అవకాశాలతోపాటు ప్రతి రంగంలో అపూర్వమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. స్వచ్ఛ భారత్, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఆయుష్మాన్ భారత్, మేక్ ఇన్ ఇండియా వంటి పథకాల ద్వారా భారతదేశాన్ని ప్రపంచంలోనే ముందంజలో నిలిపారు. ఈ కార్యక్రమంలో సేవా పక్షం జిల్లా కన్వీనర్ కనుకుంట్ల రంజిత్ కుమార్, కో కన్వీనర్లు కర్నే రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు కందిమల్ల మహేష్, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సేవా పక్షం మండల కన్వీనర్ సాగరిక, బండి సుజాత, జిల్లా నాయకులు సిద్ధం నరేష్, అంకాల జనార్ధన్, నాయకులు సుర శ్రీనివాస్, పిట్టల వెంకన్న, నవీన్, కోమాకుల నాగరాజు, రాజు, కోట సతీష్, చందా రాజు, సురేష్, శ్రీకాంత్, మధుతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# శంకరమఠానికి అపూర్వ కానుక

## అధునాతన భవనం పత్రాలు జగద్గురువుకు అందజేత

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** వరంగల్ నగరంలోని కాకతీయ సినిమా థియేటర్స్ వ్యవస్థాపకులు, ప్రముఖ ధార్మికవేత్త స్వర్గీయ సీతారామాంజనేయులు–పుష్ప బేబీ స్వర్ణ కుమారి దంపతుల కోరిక మేరకు వరంగల్ నగరం శ్రీనివాస కాలనీలోని కోట్ల రూపాయల విలువైన సకల వసతులతో కూడిన రెండంతస్తుల అధునాతన భవనాన్ని వారి కుటుంబ సభ్యులు గురువారం వరంగల్ శ్రీ శృంగేరి శంకరమఠంనకు అందజేశారు. సీతారామాంజనేయులు–బేబీ స్వర్ణ కుమారి కుటుంబ సభ్యులు శ్రీరామ్మూర్తి, విశ్వేశ్వర్ రావు తదితరలు కర్ణాటక రాష్ట్రం శృంగేరిలోని శ్రీ శృంగేరి శంకరమఠం సన్నిధానంలో శ్రీ శృంగేరి పీఠాధిపతి శ్రీ విధిశేఖర భారతికి గృహానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను అందజేశారు. విద్యారణ్య స్వామి జన్మించిన వరంగల్ మహానగరంలో శ్రీ శృంగేరి శంకర మఠం నూతన నిర్మాణం జరుగుతున్న ప్రస్తుత తరుణంలో నిత్య పూజలకు, విశేషంగా జరిగే శారద శరన్నవరాత్రులకు ఈ భవనం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా స్వామి అనుగ్రహించి మంత్రాక్షింతలతో దాతల కుటుంబ సభ్యులను విధిశేఖర భారతి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ శ్రీ శృంగేరి శంకర మఠం ప్రధాన అర్చకులు, బ్రాంచ్ హెడ్ సంగమేశ్వర జోషి, దాతలు రామ్మూర్తి, విశ్వేశ్వర్ రావు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పట్టుదలతో చదవాలి.. అనుకున్న లక్ష్యం చేరాలి

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

**వరంగల్ వాయిస్, పరకాల :** ప్రతి విద్యార్థి తాము ఎంచుకున్న లక్ష్యం కోసం పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. హనుమకొండ జిల్లా పరకాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ లో తరగతి గదులు, కిచెన్, డార్మెటరి, పరిసరాలను పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. కలెక్టర్ విద్యార్థినులను పాఠ్యాంశాలకు సంబంధించి తరగతి గదిలోని బోర్డుపై రాయించారు. విద్యార్థినులకు వండిన భోజన పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తరగతి గదులను సందర్శించి విద్యార్థినులచేత పాఠ్యాంశాలను చదివించారు. ఆయా తరగతుల విద్యార్థినులతో మీ జీవిత లక్ష్యం ఏంటి, ఏం సాధించాలనుకుంటున్నారని అడగగా డాక్టర్, ఇంజినీర్స్ అవుతామని సమాధానమిచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఎంచుకున్న లక్ష్య సాధనకు మరింత కష్టపడాలని కలెక్టర్ సూచించారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందజేస్తామన్నారు. విద్యార్థినుల అభ్యసన, పఠన సామర్థ్యం తక్కువగా ఉందని, అభ్యసన సామర్థ్యం పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అదేవిధంగా పరకాలలో ఉన్న గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న వసతులు, విద్యార్థుల సంఖ్యను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో ఆంజనేయులు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయినులు, తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యతతో ఇందిరమ్మ ఇండ్లు

**వరంగల్ వాయిస్, దుగ్గొండి :** ఇందిరమ్మ మోడల్ ఇండ్లను నిబంధనల మేరకు నాణ్యతతో త్వరితంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. గురువారం వరంగల్ జిల్లా దుగ్గొండి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ మోడల్ హౌస్ ఎంత విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు.. సెట్ బ్యాక్ ఎంత పెట్టారు.. ఉపయోగించే మెటీరియల్, క్యూరింగ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే నిధులతో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు ఏ విధంగా ఉంటుందో మోడల్ హౌస్ ఉండేలా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని ఎనిమిది మండల కేంద్రాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ పురోగమన దశలో ఉన్నాయని, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

### ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ..

దుగ్గొండి మండలంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాల్లో సిబ్బంది హాజరు, ఇతర రిజిస్టర్ లను పరిశీలించారు. ఉద్యోగుల హాజరు బయోమెట్రిక్ ప్రకారం తప్పకుండా జరగాలన్నారు. విధులకు ఆలస్యంగా హాజరైన డిప్యూటీ తహసీల్దార్, ఆపరేటర్లకు షో కాజ్ నోటీసులు జారీ చేయాలని తహసీల్దారును ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భూభారతి రెవెన్యూ సదస్సులో స్వీకరించిన ఆర్జీల పరిష్కారం పురోగతిపై సమీక్షించి, రెవెన్యూ సదస్సులో స్వీకరించిన ఆర్జీలను రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయంలో ఉన్న రైతులతో కలెక్టర్ నేరుగా సంభాషించి ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ అధికారి గణపతి, తహసిల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీవో అరుంధతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

## శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

## పోస్టర్ విడుదల చేసిన ఆలయ చైర్మన్ శ్రీనివాస్

**వరంగల్ వాయిస్, శివనగర్ :** వరంగల్ నగరంలోని 36వ డివిజన్ పుప్పాలగుట్ట శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ నెల 22 నుంచి శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్, సామాజికవేత్త ఎల్.శ్రీనివాస్ తెలిపారు. పుప్పాలగుట్ట ఇలవేల్పు ముత్యాలమ్మ దేవత అమ్మవారు తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమియ్యనున్నట్లు ప్రకటించారు. ఈ నెల 22న ప్రారంభమయ్యే శరన్నవరాత్రి ఉత్సవాలు అక్టోబర్ 2వ తేదీ వరకు సాగనున్నట్లు వెల్లడించారు. నవరాత్రుల్లో ప్రతి రోజు సాయంత్రం లలితా, చాలీసా, మణిద్వీప వర్ణన పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అమ్మవారికి షోడశోపచార పూజలు నిర్వహించి అనంతరం నక్షత్ర హారతి, తీర్థప్రసాద వితరణ నిర్వహించనున్నారు. అదే విధంగా ప్రతి రోజు సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు భక్తులందరికీ అమ్మవారి దివ్య దర్శనం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్, ప్రవీణ్, యాది, రఘు, జయ, కుమార్, ప్రదీప్, ఆలయ అర్చకుడు వెంకటేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.



# గంట రవికి ఎక్సలెన్స్ అవార్డు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** స్వయం శక్తితో ఎదిగి.. తను ఎదగటమే కాదు సామాజిక బాధ్యతగా సమాజం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్న మానవతావాది, స్ఫూర్తి ప్రదాత బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ను రాజ్ న్యూస్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించింది. గంట రవి కృషి పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించి నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఎంతో మంది యువతకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించి వారు స్వయం ఉపాధి ద్వారా ఉద్యోగాలు పొందేలా వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని గోల్డెన్ ఓక్ పాఠశాలను స్థాపించి ఎందరినో బావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. నిర్మాణ రంగంలో కూడా విలువలు, విశ్వసనీయతకు కట్టుబడి తనకంటూ ఒక మంచి గుర్తింపు పొందారన్నారు. నాణ్యత, నమ్మకానికి బ్రాండ్ ఆయన నిర్మిస్తున్న నిర్మాణాలన్నారు. పలు రంగాలలో సేవలు అందిస్తూ మంచి గుర్తింపు పొంది.. ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన గంట రవికుమార్ సేవలకు గాను తెలుగు రాష్ట్రాల్లోని ప్రజాదరణ కలిగిన రాజ్ న్యూస్ తెలుగు బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డుతో ఘనంగా సత్కరించింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com